రెవెన్యూ సదస్సులపై విస్తృత ప్రచారం చేయాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులపై కిందిస్థాయిలో విస్తృతమైన ప్రచారం జరగకపోవడం వలన రైతులు ఎక్కువమంది రాలేకపోతున్నారని విస్తృతమైన ప్రచారం చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ప్రతి గ్రామంలోనూ భూసమస్యలు పరిష్కారం కాకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పుడైనా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారని, అయితే ఏ గ్రామంలో ఎప్పుడు రెవెన్యూ సదస్సు జరుగుతుందో కిందిస్థాయిలో అధికారుల సమన్వయ లోపం వలన ప్రజలకి సమాచారం తెలియడం లేదు. అనేకచోట్ల సదస్సులు జనం లేక వెలవెలబోతున్నాయని అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు విస్తృతమైన ప్రచారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం కోరుతున్నది. ప్రజలు కూడా రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

క్వారీ పేలుళ్లతో ఇళ్లకు పగుళ్లు

- నష్టపోతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

మండలంలోని టి.గడ్డూడు క్వారీలో జరిపిన పేలుళ్లతో ఆదివారం గ్రామంలోని ఓ ఇళ్లు కూలిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని టి.గడ్డూడు గ్రామ సమీపంలో ఉన్న క్వారీ వలన ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో క్వారీలో జరిపిన బాంబు పేళ్లుల వలన గ్రామంలో ఓ ఇళ్లు కూలినట్లు తెలిపారు. క్వారీ నుంచి వచ్చే భారీ శబ్దాలను భరించలేకపోతున్నామని, రాత్రిపగలు నిద్రలేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా క్వారీ నుంచి వచ్చే దుమ్ము ధూళితో గ్రామంలోని ప్రజలు ఆరోగ్యసమస్యలను ఎదుర్కొంటున్నారని వాపోయారు. స్కూల్ పిల్లలు సైతం బడి వెళ్లలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై గతంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం తమ సమస్యను పరిష్కరించడం లేదని క్వారీ యజమాని వెంకటేష్‌పై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ఘటనపై ఆదివారం బైరెడ్డిపల్లి పోలీసుస్టేషన్‌లో ఇంటి యజమాని క్వారీ యజమానిపై ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

కుప్పం టౌన్: కుప్పం పట్టణంలో ప్రజా సమస్యల పరిస్కార వేదికను కడా ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఎంపీడిఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరిస్తారు. నియోజకవర్గంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడా పిడి వికాస్ మరమత్ కోరారు.

మరోసారి ప్రతిభ చూపిన పీఈఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు సంసిద్ కేంఫోర్డ్ పాఠశాల వేదికగా ఆదివారం ఆర్ట్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో చిత్తూరు పరిసర ప్రాంత పాఠశాలలకు చెందిన దాదాపు 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో మొదటి కేటగిరీలో బి.మాన్సీ మొదటి బహుమతి, బి.మాన్వీ రెండవ బహుమతిని కైవసం చేసుకున్నారు. రెండవ కేటగిరీలో కే. సాహితి మొదటి బహుమతి, బి.లిఖిత రెండవ బహుమతి, జె.తేజేష్ మూడవ బహుమతులను సొంతం చేసుకొన్నారు. ఈసందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణబాబు శిక్షణను అందించిన ఆర్ట్ మాస్టర్ దినేష్ గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

మోహన్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి

ఇంటర్వ్యూ



మోహన్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోంది. ఈ మేరకు జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించబడుతున్నాయి. రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో భూసమస్యలు, దారి సమస్యలు, డికెటి, మ్యుటేషన్, భూదురాక్రమణ, రీసర్వే, ఫీహోల్డ్ భూ సమస్యలు సమస్యలకు సంబంధించి వినతులను అందజేయవచ్చు. జిల్లా వ్యాప్తంగా ప్రజల నుండీ వచ్చిన ఫిర్యాదులను రికార్డు చేయడం జరుగుతుందని డిఆర్ఓ ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో రెవెన్యూ సదస్సులపై స్పందించారు.

ప్రజాశక్తి : రెవెన్యూ సదస్సుల నిర్వహణ ముఖ్య ఉద్యేశమేమిటి?

డిఆర్ఓ: ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వస్తున్న ఫిర్యాదుల్లో దాదాపు 70 శాతం రెవెన్యూకు సంబంధించిన సమస్యలే ఉంటున్నాయి. రెవెన్యూ సమస్యలను దృష్టిలో ఉంచుకొని వీటి పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో ఏ విధమైన సమస్యలున్నాయో గుర్తించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనుంది.

ప్రజాశక్తి : రెవెన్యూ సదస్సులో ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులు అందాయి..?

డిఆర్ఓ: రెవెన్యూ సదస్సులలో భాగంగా ఈనెల 6,7వ తేదీల్లో 37 గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలలో 1,217 వినతులు అందాయి. వీటిలో 22ఏ, భూ ఆక్రమణలు, రీసర్వే, మ్యూటేషన్స్, ఆర్ఓఆర్‌లకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి.

ప్రజాశక్తి: సదస్సులకు జనం వస్తున్నారా..?

డిఆర్ఓ: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి గ్రామాల్లోనే సదస్సులు నిర్వహించడం జరుగుతోంది. ఎలాంటి రెవెన్యూ సమస్యలైనా అధికారుల దృష్టికి తీసుకుపోవచ్చు. రెవెన్యూ సదస్సుల్లో తమ సమస్యలు తెలియజేసేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు.

ప్రజాశక్తి : రెవెన్యూ సదస్సుల్లో ఏఏ శాఖలు పాల్గొంటున్నాయి..?

డిఆర్ఓ: రెవెన్యూ సదస్సులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ సదస్సులో స్థానిక తహశీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, అటవీశాఖ, దేవాదయశాఖ అధికారులు సిబ్బంది పాల్గొంటున్నారు.

ప్రజాశక్తి: భూముల రీ సర్వే ఎలా జరుగుతోంది..?

డిఆర్ఓ: జిల్లాలో 822 రెవెన్యూ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 782 రెవెన్యూ గ్రామ పంచాయితీల్లో డ్రోన్ కెమెరాల ద్వారా రీసర్వే నిర్వహిస్తున్నాం. రీ సర్వే ద్వారా భూ యజమానులకు భూ హక్కు భరోసా కల్పించడం, భూ సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుంది. భూములకు సంబంధించిన వివరాలు సచివాలయంలో విలేజ్ అసిస్టెంట్, విఆర్ఓల ద్వారా తమ భూమికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకోవచ్చు.



బైరెడ్డిపల్లి కైగల్ జలపాతం

పుత్తూరులోని కైలాసకోన

పర్య'ఆటంకం'

- పురాతన ఆలయాలు.. జిల్లాకు మణిహారాలు
- వెనుకబడుతున్న టూరిజం
- ప్రతిష్టతను పెంచుతున్న జాతరలు
- సీఎం.. పర్యాటకానికివ్వాలి ఊతం
- సందర్శనాభివృద్ధికి యోచించని అధికారులు

మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం.. సంస్కృతి, సంప్రదాయాల కలయిక.. పంచ నదుల సంగమం.. ప్రకృతి రమణీయతకు ఆలవాలం.. చారిత్రాత్మక నిలయాలకు నెలవు.. అడవుల పచ్చందనాలకు, కొండకోనలకు ఇక్కడ ప్రసిద్ధి.. ఆహ్లాదపరిచే వాతావరణం.. వయ్యారాల జలపాతాల సోయగం. అరుదైన జంతుజాలాలకు, వనమూలికలకు నిలయం.. సినీ చిత్రీకరణకు అనువైన ప్రదేశం.. పర్యాటకులకు స్వర్గధామం.. ఏటా ఆనవాయితీగా జరిగే జాతరలు.. సంక్రాంతిన జరిగే జల్లికట్టు మరీ విశేషం. ఇలా ఎన్నో విశేషాల సమాహారానికి చిత్తూరు జిల్లా ప్రత్యేకం.. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ జిల్లా పర్యాటకంగా వెనుబడుతోందని విశ్లేషకుల నుంచి వినిపిస్తున్న భిన్నమైన అభిప్రాయాలు. జిల్లాల పునర్విభజన తరువాత పర్యాటకాభివృద్ధి కుంటిపడిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.



ననియాల ఎకో టూరిజం

కాణిపాకం విఘ్నేశ్వరస్వామి ఆలయం

ననియాలలో గజరాజులు

ప్రజాశక్తి-వి కోట

ఏ ప్రాంతం అయినా అందరి దృష్టిని ఆకర్షించి గుర్తింపు పొందాలంటే అనువైన అనుకూల పరిస్థితులు అక్కడ ఉండాలి. అది ఆధ్యాత్మికంగా, విద్యారంగంగా, పారిశ్రామికంగా, పర్యాటకంగానైనా ప్రసిద్ధి చెంది ఉండాలి. చిత్తూరు జిల్లా పర్యాటక కేంద్రంగా మంచి గుర్తింపు పొందుతోంది. అయితే పర్యాటకులను ఆకట్టుకోవడానికి ప్రభుత్వ తోడ్పాటు ఉండడం లేదన్నది జిల్లా ప్రజల నుంచి వినిపిస్తున్న భిన్నమైన అభిప్రాయాలు. జిల్లాలోని విశిష్ట ప్రదేశాలను అభివృద్ధి చేసి సందర్శకులను ఆకట్టుకోవడానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. దీంతో ఆర్థిక వృద్ధి, పర్యావరణ పరిరక్షణ సాంస్కృతిక మార్పిడి చెందుతాయి. జిల్లాలో ముఖ్యమైన పర్యాటక కేంద్రాలు ఇవే..

గణనాథుడు కొలువైన కాణిపాకం



చిత్తూరు నగరానికి సమీపంలో కాణిపాక క్షేత్రం ప్రసిద్ధి. స్థల పురాణం ప్రకారం ఒక బావిలో చిన్న వినాయకుడిగా ఉన్న స్వామి వారు ఇంటింటాయ్ వాటింతై అన్నంతగా కాలగమనంలో పెరుగుతున్నారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన పుణ్యక్షేత్రంలో స్వామివారి విగ్రహం నిత్యం తడిగా ఉంటుందన్నది ప్రాశస్త్యం. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వెలసిన తిరుమల, దక్షిణ కాశీగా వీరాజిల్లుతున్న శ్రీకాళహస్తికి చేరువలో ఉండటం వలన పెద్ద సంఖ్యలో భక్తులు, పర్యాటకులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఏడాధికోసారి ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలు ప్రాముఖ్యతను సంతరించుకుని అలరారుతోంది.

మహిమాన్విత 'బోయకొండ'

చౌడేపల్లి సమీపంలో ప్రకృతి అందాల నడుమ ప్రశాంత వాతావరణంలో ఎత్తైన కొండలపై నెలకొన్న ఆధ్యాత్మిక మహిమాన్విత దివ్య క్షేత్రం, భక్తులకు అండగా, కొంగుబంగారమై, అలరారుతున్నది బోయకొండ గంగమాంబ దేవాలయం. నమ్మి, తలచి, కొలిచిన వారి కోరిన కోరికలు తీర్చే అమ్మవారని భక్తుల నమ్మకం. ఇక్కడికి మన రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. పర్యాటక కేంద్రంగా కూడా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి రమణీయతకు నెలవైన "సదాశివకోన.. కైలాస కోన"లు

ప్రకృతి అందాలతో సమ్మోహన పరిచే ఎత్తైన కొండలు పొడవాటి వృక్షాల మధ్య జలజల జాలువారు జలపాతాలు సదాశివకోన.. కైలాస కోనలు. వడమాలపేటకు 10కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతాలు సహజ సిద్ధంగా నెలకొన్నాయి. ఈ జలపాతాలలో పార్వతి పరమేశ్వరులు కైలాస నాత స్వామి వెలసి భక్తుల పూజలు అందుకుంటు వారి కోరికలు నెరవేరుస్తూ విరాజిల్లుతున్నారు. ఆంధ్రరాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు ప్రకృతి అందాలు తిలకించి స్వామిని దర్శించుకుంటున్నారు. సందర్శకులకు వసతి, రవాణా సౌకర్యాలు కల్పించి అభివృద్ధి పరచాలని పలువురు కోరుకుంటున్నారు.

దక్షిణ కైలాసంగా పేరొందిన మొగిలేశ్వరుడు

బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సంతరించుకుంది. దక్షిణ కైలాసంగా పేరొందిన మొగిలేశ్వరుని ఆలయ ఇక్కడ ప్రసిద్ధి. అంతర్రాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి అత్యధికంగా శైవభక్తులు ఇక్కడకు విచ్చేస్తుంటారు. కార్తీక మాసంలో ఇక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఇక్కడ విశేషం. దీంతో పాటు అబ్బురపరిచే మొగిలి ఘాట్ రోడ్డు ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటుంది.

అర్ధగిరి క్షేత్రం

తవణంపల్లి మండలంలో వెలసిన అర్ధగిరి ఆంజేయస్వామి ఆలయానికి కర్నాటక, తమిళనాడు నుంచి కూడా ఇక్కడికి భక్తులకు అధిక సంఖ్యలో వస్తుంటారు. పచ్చని ప్రకృతి, కొండల మధ్యన ఈ క్షేత్రం సందర్శకులను ఇట్టే ఆకట్టుకుంటోంది.

కైగల్ కనివిందు

ఆధ్యాత్మిక వాతావరణానికి ప్రకృతి రమణీయతకు తలమానికంగా నిలుస్తోంది కైగల్ దుముకురాళ్ల జలపాతం. పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి సమీపంలో దట్టమైన అడవులు, ఎటు చూసినా రాళ్ల నడుమ జలజల జాలువారే జలపాతం ఈ ప్రాంతంలోని ప్రకృతి రమణీయతకు పట్టుకొమ్మగా నిలుస్తోంది. రాష్ట్రం నుండే గాక పొరుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. మరీ ఎక్కువగా వారాంతపు సెలవు దినాల్లో వస్తుంటారు. 20 అడుగులపై నుంచి శివలింగంపై జాలువారే ఈ జలపాతం, పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. జనవరి 1 నూతన సంవత్సరంతో పాటు ఇతర పండుగల్లో వేలాదిగా పర్యాటకుల తాకిడితో సందడి వాతావరణం ఉంటుంది. ప్రభుత్వం ఈ ప్రాంతంలో అభివృద్ధి చేపట్టకపోవడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా వి కోట మండలంలోని గిడిగి జలపాతం, రామకుప్పం మండలంలోని చెలిమి చేను తాండ జలపాతాలు కూడా పర్యాటకులను విశేషంగా ఆకట్టు కుంటున్నాయి. వి కోట మండలంలోని కృష్ణమ్మ కొండ కుప్పం, పలమనేరు నియోజకవర్గాలకు ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా ఆధ్యాత్మిక కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతోంది.

కుప్పంలోని ద్రావిడ యూనివర్శిటీ



అగస్త్య ఫౌండేషన్‌లో ఏపీజే అబ్దుల్ కలాం

గంగమ్మ జాతర

ఎన్‌టీఆర్ మానస పుత్రిక ద్రావిడ విశ్వవిద్యాలయం

మూడు రాష్ట్రాల కూడలిలోని కుప్పం నియోజకవర్గంలో నెలకొల్పిన ద్రావిడ విశ్వవిద్యాలయం ఆనాటి ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కలల స్వరూపం 1997వ సంవత్సరం అక్టోబర్ 20న సుమారు వెయ్యి ఎకరాల్లో ప్రారంభమైంది. ద్రావిడ భాషలపై పరిశోధనలు ద్రావిడ సాంస్కృతులు వాటి రక్షణ అభివృద్ధి కోసం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ విశ్వవిద్యాలయానికి సేవలందించిన పలువురు ఉపకులపతులు, రిజిస్ట్రార్లు నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహకారంతో ద్రావిడ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు. గత కొంతకాలంగా ఈ విద్యాలయానికి నిధులు సక్రమంగా రాకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోవడం, ఉద్యోగులకు సక్రమంగా జీతాలు కూడా అందించ లేకపోతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం ప్రాంతంలోని ఈ విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఏటా నిర్వహించే జాతర్లూ ఫేమస్..

అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన చిత్తూరు జిల్లా ప్రజలపై జాతర్ల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. పుంగనూరులో నిర్వహించే సుగుటూరు గంగమ్మ జాతర, కుప్పంలో నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతరతో పాటు చిత్తూరు, పలమనేరులలో నిర్వహించే అమ్మవార్ల జాతర్లను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తుంటారు. కుప్పం పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతర విశిష్టతను కలిగి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గ కేంద్రం కావడంతో పాటు సహజ సిద్ధంగా అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి జాతరలో పాల్గొంటారు. వీటికి భిన్నంగా చిత్తూరులో నిర్వహించే జాతరపై తమిళ సంస్కృతి అధిక ప్రభావం చూపుతోంది. చిత్తూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువైన అమ్మవారిని, వివిధ పేర్లతో కొలుస్తూ జాతర్లు నిర్వహించడం ప్రత్యేకత. పెద్ద ఎత్తున జాతర నిర్వహించే ప్రాంతాలను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ఆ ప్రాంతాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఏటా సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో నిర్వహించే జల్లికట్టు మరీ ప్రత్యేకం.

సమన్వయంతో ముందుకు వెళ్దాం..

విధిగా ప్రొటోకాల్‌ను పాటించాలి..
ఉచిత ఇసుక విధానం సమర్థవంతంగా అమలు
జిల్లా ఇంచార్జ్ మంత్రి రాంప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాం ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులతో అధికారులందరూ సమన్వయంతో ముందుకు వెళ్ళి అబివృద్ధి పథంలో నిలుపుదామని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో అధికారులతో చర్చించారు. చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయంతో ముందుకు వెళ్దామని, అధికారులందరూ విధిగా ప్రోటోకాల్‌ను పాటించాలని, జిల్లాను వ్యవసాయ, విద్య, వైద్య, ఇరిగేషన్, ఉపాధి, పారిశ్రామిక రంగాలలో ప్రథమస్థానంలో నిలపడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. అలాగే జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 కు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలో అత్యంత ఎక్కువ అభిప్రాయాల సేకరణ చేపట్టిన జిల్లాలలో చిత్తూరు జిల్లా 5వ స్థానంలో నిలుస్తోందన్నారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ప్రభుత్వ విప్, జిడి నెల్లూరు ఎమ్మెల్యే ఎంవి.థామస్, జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కె.మురళీ మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, కడ పీడీ వికాస్ మర్మత్, డిఎఫ్‌ఓ భరణి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు నిధులు జీకా, ఎంఎస్‌పి నిధుల ద్వారా జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 15 కోట్లతో 17 కాలువల మరమ్మతు చేపట్టగా 7 పనులు పూర్తి చేసి 2,740 ఎకరాల ఆయకట్టుకు సాగులోకి తెచ్చామన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా కుప్పం నియోజకవర్గాన్ని, విజయపురం మండలం కోసలనగరం, పలమనేరులో, చిత్తూరు మండలం వెంకట రామాపురంలో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించడం జరుగుతుందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2,776 పశువుల షెడ్ల నిర్మాణం చేపట్టగా 50 షెడ్ల నిర్మాణం పూర్తి చేసి 1824 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పంట సంజీవని, కాలువల పనులు ప్రారంభించామన్నారు. రెవెన్యూశాఖకు సంబంధించి 822 గ్రామాలకు గానూ 782 రెవెన్యూ గ్రామాలలో డ్రోన్‌ల సాయంతో రీసర్వే చేపట్టి సుమారు 3 లక్షల ఎకరాలను రీ సర్వే చేశామన్నారు. ఈ నెల 17 నుండి 24 వరకు దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేకశిబిరాలు ఏర్పాటు చేసి కృత్రిమ అవయవాలను అందించే కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో జిల్లా 5వ స్థానంలో, స్వర్ణాంధ్ర మిషన్ 2047 అభిప్రాయం సేకరణలో జిల్లా 5వ స్థానంలో, స్వచ్ఛతాహీ సేవలో జిల్లా ముందంజలో నిలిపిన జిల్లాకు కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలను అభినందించారు.

పంటల బీమాపై అవగాహన పెంచాలి..
ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు

వ్యవసాయరంగంలో డ్రోన్ టెక్నాలజీని వినియోగించాలని, పంటనష్టం సంబంధించి రైతులు ఇబ్బందిపడకుండా పంటల బీమాపై అవగాహన పెంచాలన్నారు. భూసారపరీక్షలు నిర్వహించడం ద్వారా రైతులకు వారి పొలాలలో ఏ పంట అనుకూలంగా ఉంటుందో తెలియజేయడం ద్వారా రైతులు నష్టపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు..
కలెక్టర్ సుమిత్ కుమార్

జిల్లాలో పిజిఆర్ఎస్ ద్వారా మొత్తం 20వేల ఫిర్యాదులు అందాయని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 33రోజుల పాటు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని, అందుతున్న ఫిర్యాదులలో దాదాపు 70 శాతం దారి సమస్య, డికెటి భూముల సమస్య, మ్యుటేషన్, గ్రామనత్తం, ప్రభుత్వ భూముల ఆక్రమణ, రీ సర్వే సమస్యలు వంటి రెవెన్యూ సమస్యలు అందుతున్నాయని అన్నారు. రెవెన్యూ సమస్యలను గ్రామ సభల ద్వారా తహసీల్దార్లు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించడానికి ఆస్కారం ఉందన్నారు.

విద్యాశాఖ తీరుపై ఎంఎల్‌సి ఫైర్

విద్యాశాఖ, సమగ్రశిక్షా అభియాన్ అధికారుల తీరుపై ఎంఎల్‌సి శ్రీకాంత్ ఫైర్ అయ్యారు. ఏ మాత్రం ఫొటోకాల్ పాటించడం లేదని ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు తన నియోజకవర్గంలో నిర్వహిస్తే కనీస సమాచారం ఇవ్వరని మెయిల్, ఫోన్‌కాల్స్‌కు ఏమాత్రం రిప్లైయ్ ఇవ్వడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో దురుసుగా ప్రవర్తిస్తూ శిక్షణా తరగతుల ఉద్దేశాన్ని తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సమగ్రశిక్షా అభియాన్ పీడి తీరు అత్యంత దారుణంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలి
జీడి నెల్లూరు ఎంఎల్ఏ థామస్

చిత్తూరు జిల్లాలో ప్రధానంగా మామిడి, చెరుకు పంటలపైనే ఆధారపడి ఉన్నారని, వారికి సరైన గిట్టుబాటు ధర అందే విధంగా అధికారులు కృషి చేయాలని, ఇందుకు మంత్రి, కలెక్టర్ చొరవ తీసుకుని రైతులకు న్యాయం జరగాలని తెలిపారు.

డొక్కా సీతమ్మ పథకాన్ని తనిఖీలు చేద్దాం..
చిత్తూరు ఎంఎల్ఏ గురజాల

ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు తనిఖీ చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించినప్పుడే వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని, ఈ దిశగా అధికారులు పనిచేయాలన్నారు. వారంలో ఒక రోజు అధికారులు, ప్రజాప్రతినిధులు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడం ద్వారా నాణ్యత పెంచవచ్చని సూచించారు.

రైతు ఎఫ్‌పిఓ వ్యవస్థను బలోపేతం చేయాలి
పూతలపట్టు ఎంఎల్ఏ మురళీమోహన్

చిత్తూరు జిల్లాలో 10 సంవత్సరాల క్రితం చెరుకు ప్రధానమైన వాణిజ్య పంట దాని ద్వారా వచ్చే నల్లబెల్లం పైన ఆంక్షలు పెట్టడం వల్ల రైతులు చెరుకు సాగును తగ్గించారన్నారు. కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలు దేశంలో విజయవంతంగా కొనసాగుతున్నాయని, రైతు ఎఫ్‌పిఓ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. పూతలపట్టు నియోజక వర్గంలో అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాలలో ఉన్న ప్రజలకు అటవీ భూముల్లో ఎదురవుతున్న సమస్యల్ని పరిష్కరించాలని తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శరణ్య

ప్రజాశక్తి-గుడిపల్లి: మండల కేంద్రంలో శరణ్య న్యూరో కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి డాక్టర్లు వైద్య సేవలు అందించారు. సుమారు 120మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బిపి, షుగర్, తలనొప్పి, ఫిట్స్, వణుకుడు సమస్యలు, నరాల బలహీనత, మతి మరుపు, నిద్ర సమస్యలు కండరముల సమస్యలు, షుగర్ వల్ల నరాల సమస్యలు వ్యాధులకు పరీక్షల నిర్వహించారు. డాక్టర్ శరణ్య సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇలాంటి క్యాంపులు నిర్వహించి మండల నిరు పేద ప్రజలను ఆదుకోవాలని స్థానికులు కోరారు.

"కిషోరి వికాశం"పై మహిళలకు అవగాహన

- సిడిపిఒ అరుణశ్రీ

సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

ప్రజాశక్తి-వి కోట: ప్రభుత్వం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిషోరి వికాశం కార్యక్రమం ద్వారా మహిళలు వారి హక్కులను రక్షించుకోవడం పట్ల అవగాహన కల్పించుకోవాలని సిడిపిఒ అరుణశ్రీ సూచించారు. మండల కేంద్రమైన వి కోటలోని స్త్రీ శక్తి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలకు మహిళా పోలీసులకు, సచివాలయ మహిళా సిబ్బందికి కల్పిస్తున్న శిక్షణలో వారి హక్కులను తెలుసుకోవాలని సూచించారు. దీని ద్వారా బాల్య వివాహాలు నిరోధకం చట్టం, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళల ఆరోగ్యం పోషణ రుతుక్రమంలో పాటించవలసిన శుభ్రత, పోక్సో చట్టం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాల పట్ల మహిళలు అవగాహన కలిగినప్పుడే సమాజంలో గౌరవంగా, నిర్భయంగా జీవించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి మాధవిలత, ఎంపియం లావణ్య, వెలుగు సిసి శాంతమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లతతో పాటు పలువురు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి పంటకు బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మామిడి పంటకు బీమా చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి సాగరిక ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరా మామిడి పంటకి పంటల బీమా పథకం ద్వారా రూ.1, 750 చెల్లించి నమోదు చేసుకోవాలని కోరారు.

దారి సమస్య పరిష్కారం

పొదలగుంట గ్రామానికి వెళ్లే దారి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని అగ్గిచేను పల్లి పంచాయతీ పొదలగుంట గ్రామానికి వెళ్లే దారిని ఓ వ్యక్తి జెసిపి సహాయంతో దారి అడ్డంగా గొయ్యి తీశాడు. దీంతో గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సమస్య జటిలం అవుతుందని భావించిన ఆ పంచాయతీ మాజీ ఎంపిటీసీ కుమారుడు సుబ్రహ్మణ్యం రెడ్డి గ్రామస్తుల సహాయంతో ఇరు పార్టీలను కూర్చోబెట్టి మాట్లాడి దారి సమస్యను ఆదివారం పరిష్కారం చేశారు. గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వేయి గోవులు, 22ఎకరాలు ఇస్తా

- తిరుమల డెయిరీపై నిర్ణయం ప్రకటించండి
- సీఎంకి రామచంద్ర యాదవ్ కీలక లేఖ

ప్రజాశక్తి-పుంగనూరు: తిరుమల పవిత్రత.. పరిరక్షణ కోసం తాను ఎటువంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నానని బీసీ యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆదివారం పేర్కొన్నారు. "తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటు చేస్తే వేయి గోవులు తాను ఇచ్చి, మరో లక్ష గోవులను సమీకరించే బాధ్యత తీసుకుంటానని గతంలోనే ప్రకటించిన ఆర్సివై తాజాగా మరో ప్రతిపాదన, ప్రణాళికతో సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. "ఒకే చోట లక్ష గోవులతో కుదరదు అనుకుంటే., జిల్లాల వారీగా 5వేల గోవుల చొప్పున డెయిరీలు ఏర్పాటు చేయవచ్చుని., అందుకు చిత్తూరు జిల్లాలో అవసరమైన భూమి తన సొంత మామిడి తోట 22ఎకరాలను టీటీడీ గోశాలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఈ లేఖ ప్రస్తుతం సంచలనంగా మారింది. డెయిరీ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ వైఖరిని ప్రకటించాలని ఆ లేఖలో సీఎంని కోరారు. ఎటువంటి స్పందన లేకుంటే నేరుగా ఉద్యమానికి దిగుతానని స్పష్టం చేశారు.

అస్తవ్యస్తంగా ఉన్న చిత్తూరు- గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి

రోడ్డు సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, నాయకులు(ఫైల్)

అంతర్రాష్ట్ర రహదారికి మహర్దశ

- చిత్తూరు- గుడియాత్తం రోడ్డు నిర్మాణానికి చర్యలు
- ఉపాధి పథకం అనుసంధానంతో నిధుల కేటాయింపు
- రూ.5.90కోట్లు మంజూరు చేసిన కలెక్టర్
- మరో రూ.10కోట్లకు ఆర్ అండ్ బి ద్వారా ప్రభుత్వానికి నివేదిక
- నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులకు 276.9లక్షలు

ప్రజాశక్తి-యాదమరి: చిత్తూరు- గుడియాత్తం అంతరాష్ట్ర రహదారి మరమ్మతులకు ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో నిధులు మంజూరు చేసింది. రూ.5.90కోట్ల నిధులను మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు నిధుల కోసం రోడ్ల భవనాల శాఖ ఇంకా రూ.10కోట్ల నిధులు అవసరమవుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ నిధులు త్వరలో రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. జోడి చింతల నుంచి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు పది కిలోమీటర్లు రోడ్డును వైసీపీ ప్రభుత్వంలో గత ఐదు సంవత్సరాలుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో హామీల్లో భాగంగా పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అంతర్రాష్ట్ర రహదారి రోడ్లను మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. జిల్లా స్థాయి ప్రతి సమావేశంలోనూ చిత్తూరు గుడియాత్తం రోడ్డు మరమ్మత్తులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని, పదేపదే కలెక్టర్ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్, ఆర్ అండ్ బి అధికారులు రోడ్డును పరిశీలించారు. గత నెలలో కలెక్టర్ అంతర్రాష్ట్ర రహదారిని పరిశీలించారు. ఈ రోడ్డు మరమ్మతు చేపట్టాలని అధిక సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో పరిశీలించిన వెంటనే కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక చొరవతో ఉపాధి హామీ పథకం ద్వారా జోడి చింతల నుంచి కనికాపురం చెక్ పోస్ట్ వరకు రూ.5.90కోట్ల నిధులను ఉపాధి పథకం కింద మంజూరు చేశారు. ఉపాధి హామీ పథకం నిధులను జిల్లా యూనిట్‌గా తీసుకుని మండల పరిధిలో ఉపాధి నిధుల అనుసంధానంతో గ్రామ పంచాయతీల వారీగా దసరాపల్లి రూ.34లక్షలు, 12 కమ్మపల్లి రూ.45లక్షలు, కసిరాల రూ.81లక్షలు, ఒటివారిపల్లి రూ.146.50లక్షలు, భూమిరెడ్డిపల్లి రూ.20లక్షలు, సిద్ధారెడ్డిపల్లి రూ.58 లక్షలు, పత్రపల్లి రూ.128లక్షలు, పత్రాపల్లి రూ.77.80లక్షలు బీటీ రోడ్డు వేసేందుకు ఎనిమిది పంచాయతీల పరిధిలో నిధులను కేటాయించారు. రోడ్ల భవనాల శాఖ, ఉపాధి హామీ పథకం సమన్వయంతో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. చిత్తూరు- గుడియాత్తం రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు వెంటనే అధికారులు పనులు ప్రారంభించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టనున్నారు.



File No.DWMA/36/2024-EDP-DWMACTR

Proceedings of the Collector/DPC, MGNREGS-AP, Chittoor
Present :- Sri Sumit Kumar, IAS.,

Roc.No. K1/185/2023 Dt :02/12/2024

Sub :- DWMA, Chittoor – Convergence with R&B Department - Providing BT surface to road from Km 12/0 to 20/250 of Chittoor – Gudiyatham Road in Yadamari Mandal – Detailed estimates submitted with a request to accord necessary administrative sanction – Administrative sanction accorded – Orders issued.

Read :- Lr.Roc.No.1/CG Road/Estimates/DB/CTR/2024-25, dt.6.11.024 of the EE (R&B), Chittoor.

ORDER :

The Executive Engineer, (R&B) Division, Chittoor, in the reference read above, has submitted that, Chittoor - Gudiyatham road is one of the important roads of Chittoor District and starts at Km.0/0 of NH-18, i.e., Chittoor Kurnool road, crosses NH4 at Km.3/9 and joins with Tamil Nadu State at Km.20/650. The vehicular traffic on this road is very high with many no. of vehicles from Vjayawada, Kadapa etc., plying towards Gudiyatham, Krishnagiri, Salem and Western parts of Tamil Nadu. Further in Km.8/8-10, the IOCL had built a storage and distribution point because of which lot of oil tankers weighing more than 50 tonnes are plying on this road.

At present, the existing crust is not sufficient for flying heavy tonnage vehicles on this road. As the agricultural lands are located on par with the road levels, the road is getting deteriorated further. Due to continuous rains in the month of July to September the stretch from KM. 12/0 to 20/650 in Yadamari mandal in Chittoor District is deteriorated further with big pot holes causing inconvenience to the public and leading to accidents. Hence it requires immediate repairs to keep the road traffic worthy condition.

This road was earlier included for improvement and strengthening under NDB Scheme Phase-II funded by New Development Bank and this scheme was not finalized. As this was included in NDB scheme Phase-III, no other works were sanctioned earlier for a period of last five years. Hence, this road is damaged extensively which cannot be maintained under ordinary maintenance works.

As this road is deteriorated badly during PGRS on every Monday we receive 3 to 4 grievances from the above villagers stating the condition of road which can't be answered by this department. There is lot of pressure from the people of above Gram Panchayats to get the road repaired. The public representatives are regularly pressing this office to get the repairs done and to keep the road in traffic worthy condition and also number of press clippings were published on the bad condition of road.

నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

గుంతల రోడ్ల మరమ్మతులకు రూ.276.9లక్షలు

పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల మరమ్మతులకు రూ.276.9లక్షలు మంజూరైంది. నియోజకవర్గంలోని గుంతల మయమైన రోడ్ల మరమ్మతులను చేపట్టేందుకు సీల్డ్ కవర్ ద్వారా అధికారులు టెండర్లు పిలిచారు. కొన్నిచోట్ల పనులు ప్రారంభమైనాయి.

రోడ్డు పనులను వెంటనే ప్రారంభిస్తాం..

చిత్తూరు- గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.

- ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, పూతలపట్టు

క్రైం కార్నర్

గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్

నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఆదివారం తనిఖీలు చేపడుతుండగా తవణంపల్లి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్(23) అదే గ్రామానికి చెందిన బాలాజీ పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకున్నట్లు సీఐ వివరించారు. వారి వద్ద 3 కేజీల గంజాయి కలిగి ఉండడంపై వారిని అదుపులో తీసుకొని విచారించగా గంజాయి విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్టు నేరం అంగీకరించినట్లు తెలిపారు. దీని విలువ దాదాపు రూ.15వేలు ఉంటుందని వెల్లడించారు. కేసు నమోదు చేసి వీరిని కోర్టుకు తరలించనున్నట్టు చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐ రామచంద్ర రెడ్డి, వల్లెమ్మ, కానిస్టేబుల్ కిరణ్, సురేంద్ర, నీరజాక్షలు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి మాజీ కౌన్సిలర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని 28వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ రామచంద్రయ్య ఆదివారం జనసేన పార్టీలో చేరారు.

ఆయనతోపాటు 15 మంది అనుచరగణం కూడా జనసేన తీర్థం పుచ్చుకోవడం జరిగింది. వీరికి జనసేన పార్టీ ఇంచార్జి వినుత జనసేనకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన బలోపేతానికి, ఓటమి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అహర్నిశలు పనిచేయాలని ఆమె కోరారు.

సైనికుల సంక్షేమం మా భాధ్యత

- జిల్లా సైనిక సంక్షేమ అధికారి రాఘవులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాఘవులు

ప్రజాశక్తి-గంగవరం: జిల్లాలో సైనికులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసి సమస్యల పరిష్కారం కోసం తప్పక పని చేస్తామని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి కెవి రాఘవులు పేర్కొన్నారు. గంగవరంలో నూతనంగా నిర్మించిన మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షులు పయని ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యులు లేవనెత్తిన పలు సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని పేర్కొన్నారు. వీటిలో ముఖ్యంగా గుర్తింపు కార్డుల జారీ, హౌస్ ట్యాక్స్ మినహాయింపు, కార్యాలయ భవనానికి స్థలం కేటాయింపు, లిక్కర్‌పై ట్యాక్స్ తగ్గింపు, మాజీ సైనికులకు భూ కేటాయింపు తదితర అనేక సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. ఇందులో భాగంగా సైనిక సంక్షేమ నిధి కొరకు విరాళాల సేకరణ కర పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గిరిధర్, ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, వెల్ఫేర్ ఆర్గనైజర్ వినాయకరెడ్డి, పలువురు మాజీ సైనికులు, ఎన్జీవో ఉద్యోగులు పాల్గొన్నారు.

హక్కుల ఉల్లంఘనను ఐక్యతతో ఎదుర్కోవాలి

బీసిఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భట్టా భాస్కర్

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-సోమల: చంద్రగిరి నియోజకవర్గంలో బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి కార్యవర్గ, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చంద్రగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బీసీ భావజాలం గలిగిన బీసీ ఉద్యోగుల వర్గాలకు సంబంధించిన సభ్యులతో నిర్వహించారు. తొలుతగా మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భట్టా భాస్కర్ యాదవ్ అధ్యక్షత వహించారు. అనంతరం భట్టా భాస్కర్ మాట్లాడుతూ నేడు జరుగుతున్న సామాజిక బీసీల హక్కుల ఉల్లంఘనపై అందరూ స్పందించాలని, కష్టపడి మనకున్న హక్కులను కాపాడుకోవాలని, అందరం సమైక్యంగా బిసిఈఎఫ్‌ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం నేడు వచ్చిందని, ఉద్యోగులందరూ సమిష్టి కృషిగా ముందుకు నడవాలని కోరారు. బీసిఈఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడైన తలారి గోపాల్ మాట్లాడుతూ నేడు సమసమాజ స్థాపనలో ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఐక్యమై ఉండి, బీసీల హక్కులను సాధించుకోవాలని సమాజంలో నేడు బీసీలపై జరుగుతున్న కుట్రలను ఛేదించాలని, రాజ్యాంగ బద్ధంగా ఎంతో మంది మహనీయులు సాధించి పెట్టిన బీసీ హక్కులను భవిష్యత్తు తరాలకు కూడా అందించడం ఇప్పుడున్న బీసీల హక్కుగా, బాధ్యతగా భావించి అందరూ ముందడుగులు వేయాలని బీసీఈఎఫ్ అనేది అందరి బీసీ ఉద్యోగులకు మేలు జరిగేటట్టుగా ఉద్యమించే ఉద్యమ సంస్థగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్, ముఖ్యఅతిథిగా టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, నియోజకవర్గ బీసిఈ ఎఫ్ కన్వీనర్‌గా మునిశేఖర్, చంద్రగిరికి సిహెచ్ ఈశ్వరయ్యని, ఎర్రావారిపాలెం వెంకటరమణని కో కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. మండలంలోని రాజులకండిగా గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే థామస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 132ఎనులకు సంబంధించి సిమెంట్ రోడ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పేద ప్రజల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని రానున్న కాలంలో మరిన్ని ప్రవేశపెడతారని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వ హయంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెంగల్‌రాయులు యాదవ్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వరరాజు, కార్యదర్శి రాజేంద్రరెడ్డి, బీసి సంఘం అధ్యక్షులు రవి యాదవ్, నాయకులు దాసరి గణేష్, గోవిందస్వామి గోపాల్ శెట్టి, మాధవరాజు, వాసుదేవరెడ్డి, బిగల రమేష్, చంద్రమౌళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి ప్రజలు 60మంది హాజరైయ్యారు. కంటి శస్త్ర చికిత్సకు 29మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వారికి పూర్తి ఉచితంగా చికిత్స చేయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ డాక్టర్ మురళి క్రిష్ణ, శ్రీనివాసులు, చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

పాల డెయిరీ వద్ద మురుగునీరు కాలువల నుంచి రోడ్డుపైకి వెళుతున్న దృశ్యం

రోడ్డుపై మురుగునీటి ప్రవాహం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల నుంచి నంజంపేట మార్గంలో పాల డెయిరీ, చర్చి, దళితవాడ వద్ద రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూ ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారుతోంది. మండల కేంద్రం నుంచి ఇదే మార్గంలో ఐదు పంచాయతీలకు బస్సులు ఆటోలు ఇతర వాహనాలు వెళ్తూ ఉంటాయి. అసలే గుంతల మాయమైన రోడ్డుపై సోమల, దళితవాడ గ్రామం నుంచి మురుగునీటి కాలువల ద్వారా వచ్చే మురుగునీరు కాలువలు నిండి రోడ్డుపై ప్రవహిస్తూ ఉండడంతో వాహనదారులు వెళ్లేటప్పుడు ఇతర వాహనదారులపై మురుగునీరు పడటం పాదాచారులపై మురుగునీరు పడటం జరుగుతోంది. ఇక పాదాచారులు వెళ్లాలంటే మొరుగునీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పంచాయతీ వారు పరిశీలించి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా పాదాచారులు వాహనదారులు ఇబ్బంది పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఖ

పంట మార్పిడి.. అధిక దిగుబడి

- తెగుళ్లు, చీడపీడల బెడద తక్కువ
- కలుపు సమస్యకు చెక్
- నెలలు మరింత సారవంతం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వ్యవసాయంలో ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేస్తే దిగుబడులు తగ్గుతాయి. చాలా మంది రైతులు ఇప్పటికీ ఒకేరకమైన పంటలను పండిస్తూ సరైన దిగుబడులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు. ఏటా పంట మార్పిడి చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు వచ్చి దిగుబడులు రెట్టింపయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులకు పంటమార్పిడి విధానంపై పలు సూచనలు చేశారు.

పంట మార్పిడిపై అవగాహన అవసరం

పంట మార్పిడి విధానాన్ని అవలంభిస్తే తెగుళ్ల బెడద తగ్గుతుంది. దీనిపై చాలా మంది రైతులకు అవగాహన లేదు. ఒకరిని చూసి మరొకరు వేసిన పంటనే వేస్తూ నష్టాల పాలవుతున్నారు. పంట మార్పిడి మూలంగా నేల భౌతిక స్థితి మెరుగు పడుతుంది. భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది. దీని వల్ల చీడపీడల బెడద అస్సలుండదు. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గించవచ్చు. శిలీంద్ర తెగుళ్లను దూరం చేయవచ్చు. బీజాలు వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి ఎక్కువవుతుంది. కీటకాల గుడ్లు వృద్ధి చెందవు. పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంది.

ఏడాదికి రెండు పంటలు

భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తర్వాత వేరే పంటను సాగు చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి. తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి. వర్షాకాలం ఎక్కువ పంటకాలం కలిగిన కంది. వేరుశనగ వంటి పంటలు వేసుకోవాలి. బంకమన్ను శాతం ఎక్కుగా ఉండే ఎర్రనేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి. మినుము, ఉలవలు, పెసర పంట పంటమార్పిడితో భూసారం ఒకే రకమైన పంటలు కాకుండా మార్పు చేయడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుంది. వీలైనంత వరకు తెగుళ్ల బాధ తగ్గ చినంత మేర వస్తుంది. కలుపు కూడా క్రమంగా తగ్గ ముఖం పడుతుంది. దీనిపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి. పక్క పొలంలో పండించిన పంటనే తాము పండించడం మానుకోవాలి. కొత్త పంటలను ఎంపిక చేసుకుని ముందుకు పోవాలి.

మండలంలో సాగవుతున్న కంది పంటలను వేయడం వల్ల నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీంతో కలుపు మొక్కలను నివారించవచ్చు. వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు వంటి అరుతడి పంటలను పండించాలి. దీని వల్ల వేరుశనగ పంటలను ఆశించే ఆకు ముడత ఉధృతిని నివారించవచ్చు. వరి పైరు తర్వాత. పప్పు ధాన్యాల పంటలు గాని నూనె గింజల పైర్లను పండించడం వల్ల వరి పంటను ఆశించే దోమ పోటులను సమర్థంగా నివారించవచ్చు. పెసర, పశుగ్రాసంగా జొన్న సాగు చేస్తే తర్వాత వేరుశనగ పంటలు వేసుకోవాలి.

సూచనలు

జొన్న సాగు తర్వాత మళ్లీ అదే పంట వేయకూడదు. దీని వల్ల ఎర్రగొంగళి పురుగు, శనగపచ్చ పురుగు ఆశించవచ్చు. వేరుశనగ తర్వాత ఆముదంతో పంట మార్పిడి చేసు కోవచ్చు. నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో వంగ, బెండ, టమాట, మినుము, పెసర పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి. వర్షాకాలంలో వరి సాగు చేసిన భూముల్లో ఆరుతడి పంటలు జొన్న, మొక్కజొన్న, పెసర, మినుములు, ఉలవలు, ఇతర కూరగాయాల పంటలు. సాగు చేసుకోవడం మంచిది.



చిట్టిబాబు, వ్యవసాయాధికారి, బంగారుపాళ్యం